

బోధనకే నిర్వచనం..
బోధనకే నిర్వచనం.. శ్రీరామకవచం వెంకటేశ్వర్లు అని సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీశంకర్ అన్నారు.
- 10లో



నేటి నుంచి ఐలా మహాసభలు
భువనగిరిలో శని, ఆదివారాల్లో జరగనున్న 'ఐలా' రాష్ట్ర తృతీయ మహాసభలకు బార్ అసోసియేషన్ ఏర్పాట్లు చేసింది.
- 10లో

గరిష్ఠం/కనిష్ఠం 42°/32°

వాతావరణం
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నలుగురు ఎస్‌ఐలకు ఉద్యోగోన్నతి

సూర్యాపేట క్రైం: జిల్లాకు చెందిన నలుగురు ఎస్‌ఐలు సీఐలుగా పదోన్నతి పొందారు. 2009 బ్యాచ్‌కు చెందిన వారికి సీఐలుగా పదోన్నతులు కల్పిస్తూ వెస్ట్‌జోన్ ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన పడిశాల శ్రీనివాస్, ఎస్‌బీ ఎస్‌ఐలుగా పనిచేస్తున్న క్రాంతికుమార్, కొడల్ రావు, గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో చేస్తూ నల్లగొండ ఎస్పీ ఆఫీస్‌కి అటాచ్ అయిన కొండల్‌రెడ్డి సీఐలుగా పదోన్నతి పొందారు.

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్‌కు ఎంపిక కావడం గర్వకారణం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గుజ్జా దీపిక

సూర్యాపేట టౌన్: కాళేశ్వర జలాలకు లక్ష జన హారతి కార్యక్రమం వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపిక కావడం గర్వకారణమని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ 1, 7, 2, 4వ స్థాయీ సంఘాల సమావేశం మధ్యాహ్నం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో జిల్లాలో విజయవంతం చేయుటకు కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు దావుల వీరప్రసాద్‌యాదవ్, సైదిరెడ్డి, పుల్లారావు, జగ్గా, దామోదర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సురేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గృహ కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలి



సూర్యాపేటలో ర్యాలీ తీస్తున్న గృహకార్మికులు

భానుపురి (సూర్యాపేట): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గృహ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని గృహ కార్మికుల యూనియన్ జిల్లా కోఆర్డినేటర్ కాసా అనసూర్య, న్యాయవాదులు వసంత సత్యనారాయణపిళ్లై, తళ్లమళ్ల హస్సేన్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో గృహ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను అమలు చేయాలన్నారు. కార్మికుల చట్టాలు అన్ని గృహ కార్మికులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. గృహ కార్మికుల పిల్లలు చదువుకునేందుకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షురాలు సుహాసిని, నాగమణి, శారద, పద్మ, మల్లిక, వరలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

హరగోపాల్‌పై ఉపా కేసు నమోదు చేయడం దుర్మార్గం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పౌర హక్కుల నేత హరగోపాల్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ ఉపా కేసు నమోదు చేయడం దుర్మార్గమని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామల్ల నవీన్, గంటా నాగయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో ప్రజా సంఘాలు, రచయితలు, హక్కుల సంఘాల నేతలపై ప్రభుత్వాలు కక్ష కట్టాయన్నారు. ప్రశ్నించే వారిపై బీజేపీ ప్రభుత్వం కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతుందన్నారు. హరగోపాల్‌తో పాటు సంధ్య, విమలక్క, పద్మజా తదితరులపై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సూర్యాపేటకు 'పట్టణ ప్రగతి' అవార్డు



మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సూర్యాపేట: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపాలిటీకి వచ్చిన రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు, సేవా పత్రాన్ని ఐటీ పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి అందుకున్నారు. మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ వెజ్–నాన్‌వెజ్ మార్కెట్, శ్మశాన వాటికలు, వైకుంఠ రథాలు ఏర్పాటు చేసినందుకు గాను ఐటీ మంత్రి కేటీఆర్ ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌ను సన్మానించారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు పారిశుద్ధ్య కార్మికురాలు నకిరేకంటి సువార్తను రాష్ట్రస్థాయిలో సన్మానించారు. పట్టణ ప్రగతి విభాగంలో సూర్యాపేటకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు రావడం పట్ల పట్టణ వాసులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దళితబంధులో వసూళ్లు!

- యూనిట్ల పంపిణీలో ముడుపుల బేరం
- ఒక్క యూనిట్‌ను నలుగురికి చొప్పున పంచి దండుకున్నారు
- గుడిబండలో చేతులు మారిన లక్షలాది రూపాయలు
- డబ్బులివ్వని వారి యూనిట్లను తిరిగి తీసుకెళ్తున్న దళారులు

కోదాడ: దళితబంధు పథకం కింద కోదాడ నియోజకవర్గానికి మంజూరైన యూనిట్ల పంపిణీలో వసూళ్ల పర్వం కొనసాగుతోంది. కోదాడ మండలం గుడిబండకు కేటాయించిన 100 యూనిట్ల పంపిణీలో గ్రామానికి చెందిన ఓ నేత అన్నీతానై చక్రం తిప్పి అందినకాడికి దండుకున్నారు. తన చేతికి మట్టి అంటకుండా దళారులను ముందు పెట్టి తతంగం తడిపించారు. ఈ వ్యవహారంలో అధికారులు కూడా ఆ నేత చెప్పినట్లు చేయడం గమనార్హం. ఈ మొత్తం వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇష్టానుసారంగా పంచారు..

గుడిబండ గ్రామానికి దళితబంధు కింద 100 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిని వంద కుటుంబాలకు ఇవ్వాల్సి ఉండగా నేతలు దీన్ని విడదీశారు. ఒక్కో యూనిట్‌ను నలుగురికి చొప్పున పంచారు. రూ.10 లక్షల యూనిట్‌ను నాలుగు భాగాలుగా చేసి ఒక్కొక్కరికీ రూ.2లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేశారని పలువురు బాధితులు చెబుతున్నారు. దీని కోసం ముందస్తుగా వారి నుంచి రూ.2లక్షలు వసూలు చేశారు. దీంతో పాటు యూనిట్ మంజూరైన వ్యక్తి మిగిలిన ముగ్గురికి పథకం కింద వచ్చే డబ్బులు ఇస్తానని ముందస్తుగా బాండ్ పేపర్ల మీద అగ్రిమెంట్ రాయించడం గమనార్హం. అయితే మంజూరైన నిధుల్లో ఒక్కో యూనిట్‌కు సంబంధించి నలుగురికి కలిపి రూ.8 లక్షలు ముట్టజెప్పి మిగతా రూ.2లక్షలు.. మొదటగా వారిని నుంచి తీసుకున్న రూ.రెండు లక్షల చొప్పున వంద యూనిట్లకు వసూలు చేసి దళారులు, నేతలు, అధికారులు పంచుకున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.



ముందస్తుగా రాయించుకున్న బాండ్ పేపర్లను చూపిస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

నేటికీ బయటకురాని జాబితా

గ్రామానికి మంజూరైన యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక రహస్యంగా జరిపారు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత కనుసన్నల్లో ఈ వ్యవహారం నడిపారు. ఆ నేత తన అనుచరుల చేత ఈ మొత్తం తతంగం నడిపించారు. పథకం మంజూరై దాదాపు ఏడాది పూర్తి కావొచ్చినా నేటికీ లబ్ధిదారుల జాబితాను అధికారులు ప్రకటించకపోవడంపై అనుమానాలకు తావిస్తోంది.

గేదెలను లాక్కుపోయారు..

ఒక్క దళితబంధు పథకం కింద మంజూరైన ఎనిమిది గేదెల్లో ఒక్కొక్కరికీ రెండు చొప్పున నలుగురికి పంచారు. అయితే ముందస్తుగా డబ్బులు ఇవ్వని వారి నుంచి నేతల అనుచరులు గేదెలను లాక్కుపోయారు. ఇలా లాక్కుపోయిన మొత్తం 40–50 గేదెలతో నేతల అనుచరులు డెయిరీ ఫాం నడుపుతున్నట్లు సమాచారం.

ఒక్క ఆటో మాత్రమే ఇచ్చారు



దళితబంధు కింద నాకు టెంట్‌హౌజ్ మంజూరైంది. దీని కోసం రూ.2లక్షలు ఇవ్వాలని ముందస్తు ఒప్పందం చేసుకున్నారు. యూనిట్ మంజూరు కాగానే ఒక ఆటో ఇచ్చారు. మిగతా డబ్బులు వారే తీసుకున్నారు. గట్టిగా అడిగితే కేసు పెట్టారు. చిన్నపిల్లను తీసుకొని వర్షంలో తడుస్తూ వారం రోజులు స్టేషన్ చుట్టూ తిరిగాను.

– ఊదర అశ్విని, గుడిబండ

నాలుగు గేదెలిచ్చి.. తీసుకుపోయారు



దళితబంధు పథకం యూనిట్ మంజూరైందని చెప్పారు. యూనిట్ కింద ముందు నాలుగు గేదెలు ఇచ్చారు. తర్వాత మరో నాలుగు గేదెలను ఇస్తామని చెప్పారు. ముందస్తు ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వలేదని ఇచ్చిన నాలుగు గేదెలను కూడా లాక్కుపోయారు.

– మర్రి యేసమ్మ, గుడిబండ

సఫాయిలు.. మీకు సలాం



పట్టణ ప్రగతిపై మున్సిపల్ శాఖ ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల, కలెక్టర్ వెంకట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ తదితరులు

- వారి శ్రమతోనే 'పేట'కు అవార్డుల పంట
- పట్టణ ప్రగతి సంబురాల్లో మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: సఫాయిలు మీకు సలాం చేస్తున్నా.. సూర్యాపేట పట్టణాభివృద్ధిలో మీ పాత్ర కీలకం.. మీరు అందించిన సేవల వల్లే సూర్యాపేట పురపాలక సంఘం రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అవారులు అందుకుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సూర్యాపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన మహాప్రస్థానంలో వినూత్నంగా జరిగిన పట్టణప్రగతి సంబురాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాప్రసస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ కరోనా సమయంలో ఉత్తమ సేవలు అందించిన సూర్యాపేట పురపాలక సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగినికి జాతీయ స్థాయిలో పురస్కారం అందుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అందుకు కొనసాగింపుగా శానిటేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చడంతో పాటు విధుల్లో క్రమశిక్షణకు గుర్తింపుగా మరలా హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖామంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు. ఇప్పటికే సూర్యాపేట జాతీయ స్థాయిలో మూడు, రాష్ట్ర స్థాయిలో ఒకటి పొందగా, నేడు పట్టణంలో నూతనంగా నిర్మించి నేడు ప్రారంభించుకున్న మహాప్రస్థానం, ఇంటిగ్రేటెడ్ వెజ్–నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణాలకు గాను రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇక్కడి ప్రజలు బోటునెక్కాలనే కోరిక కూడా తాజాగా సద్దుల చెరువు మినీట్యాంక్ బండ్‌లో బోట్లను ప్రారంభించి తీర్చామన్నారు. అనంతరం పట్టణంలోని మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కలెక్టర్ వెంకట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు.



మహాప్రస్థానాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ, కలెక్టర్



సూర్యాపేటలో మానవహారం నిర్వహిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు

ఒక్కరోజే 10 లక్షల మొక్కలు

'దశాబ్ది వనాలు' పేరుతో నాటాలని నిర్ణయం

- 19న హరితోత్సవంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం
- 11 మండలాల్లో ఎస్సారెస్పీ కాలువల వెంట నాటేలా కార్యాచరణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న హరితోత్సవం కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే రోజు 9వ విడత హరితహారం ప్రారంభించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా ఆ ఒక్క రోజే ఎస్సారెస్పీ కాలువ పరిధి లోని మండలాల్లో 'దశాబ్ది వనాలు' పేరుతో 10 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు.

11 మండలాల్లో ఎంపిక చేసిన స్థలాల్లో..

జిల్లాలో కేవలం ఎస్సారెస్పీ కాలువల పరిధిలో గల తుంగతుర్తి నియోజకవర్గంలోని తుంగతుర్తి, నాగారం, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతన్‌కల్, సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట, చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), అలాగే కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె మండలాల్లో ఎంపిక చేసిన స్థలాల్లో పలు రకాల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. ముఖ్యంగా నీటిపారుదల శాఖకు చెందిన స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో ఇప్పటికే ప్రత్యేక సర్వే చేపట్టారు. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లోని ఎస్సారెస్పీ ప్రధానంగా కాల్వల వెంట ఉన్న స్థలాలను సైతం గుర్తించారు. అన్ని శాఖలకు సంబంధించిన మండలాల అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందుకు మొక్కలు సిద్ధంగా ఉంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

శాఖల వారీగా నాటే మొక్కలు

గ్రామీణాభివృద్ధి శాఖ	5 లక్షలు
అటవీ శాఖ	లక్ష
మున్సిపల్, ఎక్సైజ్, ఇతర శాఖలు కలిపి	4 లక్షలు



చివ్వెంల మండల కేంద్రంలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

ఇతర ప్రదేశాల్లోనూ నాటేలా..

ఇరిగేషన్ భూములతో పాటు ఖాళీగా ఉంటున్న ప్రభుత్వ స్థలాల్లోనూ మొక్కలను నాటాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో ఉన్న ఖాళీ ప్రదేశాలు, గతంలో నాటిన మొక్కలు చనిపోయి ఉంటే వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటనున్నారు. గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే స్థలాలు గుర్తించిన అధికారులు గుంతలు తవ్వించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

గుంతలు తీసి సిద్ధం చేశాం..

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న ఒక్క రోజు 10 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే స్థలాలను గుర్తించి గుంతలు తీసి మొక్కలు నాటేందుకు సిద్ధం చేశాం. ఉపాధి కూలీలను వినియోగించుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం. అదే రోజు 9 విడత హరితహారం కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తాం.

– కిరణ్ కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

వసతుల కల్పనకు నివేదికలు సిద్ధం చేయండి

- కలెక్టర్ వెంకట్రావు ఆదేశం
- ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన మౌలిక వసతులపై త్వరలో హైదరాబాద్‌లో జరిగే సమావేశానికి 40 అంశాలతో కూడిన నివేదికలను ఈ నెల 19 నాటికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, పోలీస్ అధికారులతో ఎన్నికల సమాయత్తంపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్లు, పోలీస్ అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. డబుల్, చనిపోయిన వారి ఓట్ల తొలగింపునకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి సర్వేను ఈ నెల 22 నాటికి పూర్తి చేయాలన్నారు. అలాగే మండల మ్యాప్‌లను రెవెన్యూ గ్రామాలు, పోలింగ్ స్టేషన్ల వారీగా సిద్ధం చేయాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ సిద్ధం చేయాలని, అదేవిధంగా పోలీస్ డేటాను సేకరించి అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికల విధి విధానాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, కిశోర్ కుమార్, డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

బస్సు జాతాను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

దురాజ్ పల్లి (సూర్యాపేట): అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇళ్ల సాధనకై ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే బస్సు జాతాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన ప్రజాసంఘాల పోరాట వేదిక సూర్యాపేట జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఈ నెల 18న కోదాడ మండలం కాపుగల్లుకు బస్సు జాతా రానుందని తెలిపారు. సమావేశంలో ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జునరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, నెమ్మాది వెంకటేశ్వర్లు, సీనియర్ నేత పాలిశెట్టి యాదగిరిరావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, అంజిబాబు, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కిషోర్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేర్పుల వెంకన్న, సైదమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి

రామగిరి(నల్లగొండ) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలంలోని చిన్న సూరారం సమీపంలో జూన్ 9న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని ఎర్రగడ్డలగూడెం గ్రామానికి చెందిన తాటికొండ సిద్దార్థ రెడ్డికి (18) తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. సిద్ధార్థరెడ్డి అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.ధర్మా తెలిపారు.

అదుపుతప్పి రైస్‌మిల్లు ప్రహరీని ఢీకొన్న కారు



కోమటికుంట వద్ద ప్రహరీని ఢీకొన్న కారు

పాలకవీడు : మద్యం మత్తులో కారును అతివేగంగా నడుపుతూ రైస్‌మిల్లు ప్రహరీని ఢీకొట్టిన ఘటనలో పలువురు యువకులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటన మండలంలోని కోమటికుంట గ్రామ శివారు మూలమలుపులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన యువకులు జాన్‌పహాడ్ దర్గా వద్ద నిర్వహించిన కందూరులో పాల్గొన్నారు. ఈ క్రమంలో తప్పతాగి కారు నడపడంతో మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి రైస్‌మిల్లు ప్రహరీని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో వారికి ప్రాణాపాయం తప్పిందన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

రామగిరి(నల్లగొండ) : ఓ వ్యక్తి అదృశ్యం కావడంతో తిప్పర్తి మండల పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలంలోని కేశరాజుపల్లి గ్రామానికి చెందిన గాలి సోమయ్య(60) తాపీ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా సోమయ్య పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇదే విషయమై ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులను, తెలిసిన వారిని సోమయ్య గురించి వాకబు చేశారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో చివరకు కుమారుడు గాలి అశోక్ శుక్రవారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.ధర్మా తెలిపారు.

మహిళ హత్య కేసులో వ్యక్తి అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు
- కేసు వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్ చంద్ర



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి : మతిస్థిమితం లేని ఓ మహిళను దారుణంగా హత్య చేసిన వ్యక్తిని జిల్లా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలను శుక్రవారం భువనగిరిలోని డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాజేష్ చంద్ర వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం చిన్నరావిరాల గ్రామానికి చెందిన సోమని యాదమ్మ (55) 8సంవత్సరాల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఆమెకు మతి స్థిమితం సరిగా లేకపోవడంతో వివిధ గ్రామాలకు తిరుగుతూ కొన్ని రోజుల తర్వాత ఇంటికి వెళ్తుండేది. ఇటీవల భూదాన్‌పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి గ్రామ పరిసరాలలో తిరుగుతూ ఉండేది. ఈనెల 13న రాత్రి కావడంతో ఇదే గ్రామంలోని శివారులో ఉన్న దుర్గ వైన్స్ ఎదురుగా ఉన్న పాడుబడిన సెల్లార్‌లోకి వెళ్లింది. ఈనెల 14న ఉదయం వైన్స్‌లో మద్యం కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి అనంతరం సెల్లార్ వైపు మూత్ర విసర్జన కోసం వెళ్లాడు. అక్కడ అర్ధనగ్నంగా ఉన్న మహిళా మృతదేహం కనిపించడంతో స్థానిక సర్పంచ్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి అనంతరం క్లూస్ టీం, డాగ్‌స్వాడ్‌ను తీసుకవచ్చి పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా సంఘటన స్థలానికి సమీపంలో లభించిన ఆధార్‌కార్డు, చెప్పుల ఆధారంగా ఈనెల 16న ఉదయం గ్రామ పరిసర ప్రాంతాలలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు. విచారణంలో భాగంగా హత్య స్థలంలో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా హత్యను అంగీకరించారు.

తలపై రాయితో మోదడంతో..

బీహార్ రాష్టానికి చెందిన మహ్మద్ అన్వర్ గత సంవత్సరం క్రితం పిల్లాయిపల్లి గ్రామానికి వలస వచ్చాడు. ఈనెల 13న గ్రామ శివారులో ఉన్న వైన్స్‌లో మద్యం సేవించాడు. రాత్రి కావడంతో వైన్స్‌కు ఎదురుగా పాడుబడిన భవనం పైకి వెళ్లాడు. ఈ క్రమంలో భవనం సెల్లార్‌లో ఒంటరిగా పడుకుని ఉన్న మహిళను గమనించాడు. మద్యం మత్తులో ఉన్న అన్వర్ మహిళపై అత్యాచారాయత్నానికి పాలడ్డాడు. ఈ సమయంలో ఆమె కేకలు వేయడంతో పక్కనే ఉన్న రాయితో తలపై మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీ మొగులయ్య, సీఐ మహేష్, ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి, సురేష్, సిబ్బంది ఉన్నారు.

కార్మిక సదస్సును విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న కైలాస్ తదితరులు

చండూరు : చౌటుప్పల్‌లో ఈనెల 20న జరిగే ఐఎన్‌టీయూసీ మునుగోడు నియోజకవర్గ స్థాయి కార్మిక సదస్సును విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత పిలుపునిచ్చారు. శుక్రవారం చండూరు మున్సిపల్ కేంద్రంలో సదస్సుకు సంబంధించిన కరప్రత్రాలను ఆయన విడుదల చేసి అనంతరం విలేకరులతో మాట్లాడారు. 9సంవత్సరాల మోదీ, కేసీఆర్ పాలనలో ప్రభుత్వ ఆస్తులను అమ్మి దేశాన్ని అంబానీ, అదానీలకు దోచిపెట్టారని అన్నారు. దేశంలో కార్పొరేట్ శక్తులు రాజకీయాలు చేస్తూ ప్రభుత్వాలను శాసిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ గతంలో ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే, బీజేపీ ప్రభుత్వం నేడు కార్పొరేట్ వ్యక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న, చండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బురకల భిక్షం, ఓబీసీ జిల్లా చైర్మన్ జిల్లాపల్లి పరమేష్, నియోజకవర్గ అధ్యక్షుడు బడేసాబ్, ఐఎన్‌టీయూసీ చండూరు మండల అధ్యక్షుడు ఎండీ రఫీ, అశోక్‌యాదవ్, మల్లేష్, మంచుకొండ సంజయ్, గుండా శ్రీనివాస్, పన్నాల లింగయ్య, నెర్లకంటి రవికుమార్, బురకల దశరథ, సోము లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కారు, బొలేరో వాహనం ఢీ.. ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

చింతపల్లి : కారు, బొలేరో వాహనం ఎదురెదురుగా ఢీకొనగా వెనుక నుంచి వస్తున్న కారు మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు నుజ్జునుజ్జు కాగా రెండు కార్లలో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని పోలేపల్లి రాంనగర్ సమీపంలోని హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ చంద్రారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించారు. దీంతో రాష్ట్ర రహదారిపై గంట పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



వనం రాంబాబు (ఫైల్)

ఆలేరురూరల్ : బొలేరో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రం పరిధిలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వడ్డెరబస్తీకి చెందిన వనం రాంబాబు(26), దాసరి సమ్మయ్య బావబామ్మర్దులు. వారు ఇద్దరు ద్విచక్రవాహనంపై భువనగిరి వైపు వెళ్తన్నారు. వారు పట్టణ శివారులోని ఇండియన్ పెట్రోల్‌బంక్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని డ్రైవర్ పెట్రోల్ బంక్‌లోకి పోనిచ్చే క్రమంలో ఒక్కసారిగా కుడివైపునకు తిప్పాడు, ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం బొలేరో వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న రాంబాబు అక్కడికక్కడే మృతి చెందగా, సమ్మయ్యకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతిడికి భార్య, కూతురు ఉన్నారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.వెంకటశ్రీను తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో ఢీకొన్న వాహనాలు

హుజూర్‌నగర్‌లో ఓ వ్యక్తి..

హుజూర్‌నగర్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన పిడమర్తి గోపీచంద్ (35) సుతారి పని నిమిత్తం కోదాడ తన ఆటోలో వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని కోదాడ రోడ్డులోని సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే గోపీచంద్ నడుపుతున్న ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో అతడు ఆటో కింద పడి తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గోపీచంద్‌కు భార్య పద్మ, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డివాము దగ్ధం

మేళ్లచెరువు : ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని గడ్డివాము దగ్ధమయ్యింది. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని రాఘువాపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుబ్బారావు అనే రైతు గడ్డివామును ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్నాడు. ఈ గడ్డివాము సమీపంలో విద్యుత్ లైన్ ఉండడంతో మధ్యాహ్నం వీచిన గాలులతో విద్యుత్ తీగలు ఒకదానికొటి తగిలి మంటలు వ్యాపించి సమీపంలోని గడ్డికి అంటుకున్నాయి. దీంతో గడ్డివాము పూర్తిగా కాలిబూడిదయ్యింది. కాగా మంటలు ఆర్పడానికి మైహోం సిమెంట్ ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలను పూర్తిస్థాయిలో అదుపు చేశారు. ఈ ఘటనలో బాధితుడికి సుమారు రూ.30వేల నష్టం వాటి నట్లు పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు

హుజూర్‌నగర్ : మహిళను వేధించడంతో ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం పట్టణ ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ముత్తినేని కృష్ణ పట్టణానికి చెందిన ఓ మహిళకు పలుమార్లు ఫోన్ చేసి వేధించడంతో బాధితురాలు హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



కోడి రమ్య (ఫైల్)

మద్దిరాల : పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని కుంటపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంటపల్లి గ్రామానికి చెందిన కోడి అశోక్‌కు 7సంవత్సరాల క్రితం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని బోడ్లాడ గ్రామానికి చెందిన రమ్యశ్రీతో ప్రేమ వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో కుటుంబంలో జరుగుతున్న గొడవలతో రమ్యశ్రీ మనస్థాపం చెంది బుధవారం పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేట కమలా ఆస్పత్రికి తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. రమ్యశ్రీకి 16నెలల కుమారుడు ఉన్నాడు. మృతురాలి తమ్ముడు చెల్లగోల రాజు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్రంపోడు మండలంలో ఒకరు..

గుర్రంపోడు : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మక్కపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేక ప్రభాకర్‌రెడ్డి(60) సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని దేవరకొండ ఆసుపత్రికి తరలించారు. దీంతో అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

శాస్త్రోక్తంగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాల్ అమ్మవారి తిరువీధి, ఊంజలి సేవోత్సవాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. ఆండాల్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో సేవోత్సవం చేపట్టారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజలి పర్వాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారికి ఆచార్యులు విశేష పూజలు జరిపించారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.22,04,598 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

శివాలయంలో చండీ హోమం

దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయ సన్నిధిలో ఆచార్యులు, పూజారులు చండీ హోమం నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మహా శివుడిని, శ్రీలక్ష్మీనరసింహ స్వామిని కోరారు.

రైతులు అధిక ఆదాయం పొందాలి



అవార్డులు పొందిన రైతులతో వినయ్‌కుమార్

మిర్యాలగూడ అర్బన్ : రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందాలని నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గల రైతు వేదికలో నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు సమష్టిగా ఏర్పడి ఉమ్మడి వ్యవసాయం ద్వారా కూరగాయలు, తృణధాన్యాల సాగు చేపట్టి అధిక దిగుబడిని పొందవచ్చని తెలిపారు. అనంతరం కేవీకే, ఏఆర్‌ఎస్ కంపాసాగర్ శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, శ్రీధర్ రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం త్రిపురారం, ఐలాపురం ఎఫ్‌పీఓలను ప్రారంభించి డైరెక్టర్లు, రైకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఓ సంగీతలక్ష్మి, నేస్తం ఫౌండేషన్ సీఈఓ సురేష్, వ్యవసాయ అధికారి స్టెఫిగ్రఫ్, నందిపాడు సీడ్‌ఫాం డీఎం కృష్ణవేణి, నిడమనూరు మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, మండల ఉద్యాన అధికారి రవినాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి సైదులు, షఫీ, స్వప్న, హిమబింధు, వెంకటేష్, సతీష్, విక్రమ్, సృజన్, వెంకన్న, శంకర్ ఉన్నారు.

పెట్రోల్ పోసుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం

తిరుమలగిరి : బీసీ కుల వృత్తిదారులకు తెలంగాణ ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష ఆర్థికసాయానికి అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం కావడంతో ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తిరుమలగిరి మండలంలోని మాలిపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సోమాచారి కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోగా సర్టిఫికెట్లు రావడానికి ఆలస్యం కావడంతో ఆందోళనకు గురై శుక్రవారం రాత్రి పెట్రోల్ పోసుకొని నిరసన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై తహసీల్దార్ రమణారెడ్డి మాట్లాడుతూ.. తహసీల్దార్, మీసేవా కేంద్రాల్లో సర్వర్ బీజీగా ఉండటంతో సర్టిఫికెట్ల జారీ ఆలస్యమవుతున్నాయని లబ్ధిదారులు ఎవరు ఆందోళన చెందవద్దని అందరికి సర్టిఫికెట్లు అందుతాయని తెలిపారు. కార్యాలయ సిబ్బంది అర్ధరాత్రి 12 గంటల వరకు ఉండి సర్టిఫికెట్ల కోసం పని చేస్తున్నారని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో తిరకాసు



మర్రిగూడ పీఏసీఎస్ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మర్రిగూడ : మండల కేంద్రంతో పాటు మండలంలోని యరగండ్లపల్లిలో మర్రిగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కొనుగోలు జరుపుతున్న సమయంలో క్వింటాకు తరుగు ఒకట్రెండు కేజీలు తీస్తున్నామని చెప్పి మిల్లుల వద్దకు వెళ్లిన తరువాత క్వింటాకు 7.5కిలోల చొప్పున తీసినట్లు రైతులకు రశీదులు అందడంతో నివ్వెరపోయారు. రెండు కొనుగోలు కేంద్రాల వద్ద 719 మంది రైతుల నుంచి 78,575 బస్తాలను 34,429 క్వింటాళ్ల ధాన్యాన్ని 111లారీల ద్వారా మిల్లులకు తరలించారు. 7.5 కేజీల తరుగు ఎలా తీస్తారని రైతులు సంఘం వద్దకు వచ్చినప్పటికీ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆగ్రహించిన రైతులు సంఘం ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ దేవులపల్లి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పగడాల లింగయ్య, బాయికాడి కొండలు, జమ్ముల వెంకటేశ్‌గౌడ్, చాపల మల్లయ్య, రైతులు ఐతగోని శ్రీశైలం, బాసిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, కొడాల ముత్యంరెడ్డి, మధుసూదన్, వెంకట్‌రెడ్డి, భగవంత్ రెడ్డి, యాదయ్య, కృష్ణయ్య, జంగయ్య, రామస్వామి, రఘుమారెడ్డి, రాంరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

సూర్యాపేట క్రైం : తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన కండక్టర్ బత్తుల సుధాకర్ ఈనెల 12న తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి వెళ్లాడు. దీంతో ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని బీరువా తాళం తీసి రెండు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చిన సుధాకర్ తాళం పగిలిఉండడాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. దీంతో వెంటనే బాధితుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ హిల్‌కాలనీలోని కెనాల్ సమీపంలో గల ఓ ఇంట్లో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన గగ్గెనపల్లి సత్యనారాయణరెడ్డి ఉదయం 8గంటలకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 12.30గంటలకు ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసుల సాయంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం తీసి అందులో గల తులం బంగారు చైను, రూ.5వేల నగదును తీసుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విజయపురి టౌన్ ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజాపేటలో ..

రాజాపేట : మండల కేంద్రంలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన సీసీ కెమెరాల్లో రికార్డై శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొట్టింది. మండల కేంద్రంలో ఓ ఇంటి వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తి తలుపు తెరిచి లోపలికి ప్రవేశించి లైట్లు వేసుకుని చోరీకి పాల్పడినట్లు కెమెరాల్లో రికార్డు అయింది. ఇంటి యజమాని కొంత కాలంగా ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు రాలేదని, ప్రస్తుతం ఒకరిని అనుమానిస్తూ రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో అనాథ వృద్ధుడు మృతి



వెంకటయ్య మృతదేహం

డిండి : అనారోగ్యంతో ఓ అనాథ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని వీరబోయనపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వీరబోయనపల్లి గ్రామానికి చెందిన కాలూరి వెంకటయ్య(70)కు అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహం జరిగింది. కానీ వారికి సంతానం లేకపోవడంతో దాదాపు 30సంవత్సరాల క్రితమే సదరు మహిళ తల్లిగారి ఇంటికి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి వెంకటయ్య అనాథగానే జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటయ్య కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియలు నేడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాలని పలువురు గ్రామస్తులు స్థానిక సర్పంచ్ సత్తయ్యను కోరినట్లు తెలిసింది.

మనోధైర్యం కల్పించేందుకు కార్డెన్ సెర్చ్‌లు



కార్డెన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు



హుజూర్‌నగర్ : తమ్మారంలో పట్టుబడిన ద్విచక్రవాహనాలు



అనంతగిరి : మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి

- మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి
- ధ్రువపత్రాలు లేని 20వాహనాలు సీజ్
- చింతలపాలెంలో 35వాహనాలు..

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 20వాహనాలను సీజ్ చేశారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని రవీంద్రనగర్, కృష్ణకాలనీ, కృష్ణమానస కాలనీల్లో మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి పర్యవేక్షణలో మిర్యాలగూడ వన్ టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు రాఘవేందర్, నర్సింహారావు, ముత్తినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 10గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ఇళ్లలో తనిఖీ చేయగా 20వాహనాలు నంబర్ ప్లేట్లు, సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటగిరి మాట్లాడుతూ.. ప్రజల్లో మనోధైర్యం కల్పించేందుకు కాలనీల్లో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కాలనీలో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ఎంతో రక్షణగా ఉంటుందన్నారు. కాలనీల్లో అనుమానితులుగా కని పిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లను సమాచారం అందించాలన్నారు. ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల్లో మనోధైర్యం నింపేందుకే పోలీస్ శాఖ ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో వన్ టౌన్, టూ టౌన్‌తో పాటు మిర్యాలగూడ రూరల్ సర్కిల్ ఎస్‌ఐలు దోరేపల్లి నర్సింహులు, ముత్యాల రాంమ్మూర్తి, శ్రీనునాయక్, శివతేజ, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, రవి, నరేష్, శ్రీను, హరిబాబులతో పాటు ఆయా పోలీస్‌స్టేషన్లకు చెందిన ఏఎస్ ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్లు వంద మందికిపైగా పాల్గొన్నారు.

తమ్మారంలో..

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని తమ్మారంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 35ద్విచక్ర వాహనాలు, 2ట్రాక్టర్లను సీజ్ చేశారు. అనంతరం హుజూర్‌నగర్, కోదాడ రూరల్ సీఐలు రామలింగారెడ్డి, రామకష్ణారెడ్డి మాట్లాడారు. గ్రామంలో గ్రూపు తగాదాలు పెట్టుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దన్నారు. గ్రామంలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సైబర్ నేరాలు, డయల్ 100 తదితర విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 7గురు ఎస్‌ఐలు, 44 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తమ్మరబండపాలెంలో..

అనంతగిరి : మండలంలోని తమ్మరబండపాలెం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో కోదాడ డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి పాల్గొని మాట్లాడారు. సరైన ధ్రువీకరణ పత్రాలులేని 23ద్విచక్రవాహనాలు, 10 ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. ధ్రువపత్రాలు లేని వాహనాలను కలిగి ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కోదాడ పట్టణ సీఐ అంజనేయులు, మునగాల సర్కిల్ సీఐ వీరరాఘవులు, ఎస్‌ఐలు అనిల్‌రెడ్డి, ప్రవీణ్, సాయిప్రశాంత్, లోకేష్, ఏడుకొండలు, శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.